ఫ్రాంజ్ కాఫ్కా

# న్యాయ విచారణ



"ద ట్రయల్"కు తెలుగు తర్జుమా: నశీర్

SuraVara.com

# న్యాయ విచారణ

## ఫ్రాంజ్ కాఫ్కా

తెలుగు తర్జుమా – నశీర్

సురవర.కాం

Nyaya Vicharana

Telugu Translation of Franz Kafka's "The Trial"

Translation with an Introduction: Naseer

© Translator, Publisher.

Cover Design: Naseer

Price: Rs.200/-

Published by:

Suravara Language Technologies.

www.suravara.com

This book is digitized and brought to you by KINIGE

# శిలువ మోసిన రచయిత

"నేను సాహిత్యం తప్ప మరేమీ కాను."

—

"నేను సాహిత్యం ద్వారానే జీవితాన్ని పట్టుకుని వేలాడుతున్నాను. దాన్ని కోల్పోతే అంతట్నీ కోల్పోయినట్టే."

—

"రచన మృత్యువు కన్నా గాఢమైన నిద్రలాంటిది. మనం శవాల్ని వాటి సమాధుల్లోంచి లాగనట్టే, ఎవరూ నన్ను రాత్రుళ్ళు నా డెస్కు నుంచి లాగలేరు."

—

"అధోజగత్తు నుంచి బయటపడే పద్ధతి ఎవరిది వాళ్ళకు ఉంటుంది, నా పద్ధతి రచన. అందుకే, రాయటం ద్వారా మాత్రమే నేను స్థిమితంగా కొనసాగగలను, విశ్రాంతీ నిద్రల ద్వారా కాదు. ప్రశాంతంగా ఉన్నప్పుడు రాయటం కాదు, రాయటం ద్వారానే ప్రశాంతత పొందగలను."

—

"నేను అదృశ్య సాహిత్యానికి అదృశ్య గొలుసులతో కట్టివేయబడినవాణ్ణి, ఎవరన్నా సమీపించే ప్రయత్నం చేస్తే వాళ్ళు నా గొలుసులు ముట్టుకోవటానికి వస్తున్నారేమో అనుకుని అరిచేవాణ్ణి."

—

"నాకు తగిన జీవన శైలి ఏమిటంటే, నేను ఒక విశాలమైన భూగృహంలో, ఒక మారుమూల గదిలో, ఒక దీపమూ, నా రాతసామాగ్రీ పెట్టుకుని కూర్చుంటాను. భోజనం నాకు తెచ్చిపెడతారు, కాని నా దగ్గరకు కాదు, నా గదికి చాలా

దూరంగా, భూగృహపు అవతల ఎక్కడో ఉన్న గుమ్మం దగ్గర పెడతారు. భూగృహపు గదుల గూండా, డ్రెస్సింగ్ గౌనులో, ఈ భోజనం దాకా నడవటమే నా ఏకైక వ్యాయామం. తర్వాత మళ్ళీ రాతబల్ల దగ్గరకు వెళిపోతాను, నెమ్మదిగా తాపీగా తింటాను, వెంటనే రాయటం మొదలుపెడతాను. ఎలా రాస్తాననుకున్నావ్! ఎంతెంతటి లోతుల్లోంచి తవ్వి తీస్తాననుకున్నావ్! అదీ శ్రమ లేకుండా! ఎందుకంటే తీవ్రమైన ఏకాగ్రత శ్రమ తెలియనీయదు."

* * *

ఏమిటీ గొంతు? ఈ గొంతు యజమాని సాహిత్యానికి ఇంతగా ఎందుకు బంధీ అయిపోయాడు? సాహిత్యానికీ జీవితానికీ ఇంతగా విడదీయరాని లంకె ఎలా వేసుకున్నాడు? అతను సృష్టించిన సాహిత్యం ఎలాంటిది?

ఎవరైనా సాహిత్యానికి ఇంతగా అంకితమయ్యారంటే, బహుశా వాళ్ళు తమ రచనల ద్వారా ఏదో బృహత్తరమైన మంచి చేయటానికో మార్పు తేవటానికో పూనుకుని ఉంటారనీ, వారి ఉద్దేశం అంత బృహత్తరం కాబట్టే సాహిత్యంపై తమ జీవితపు బరువు మోపగలిగే ధైర్యం చేయగలిగారనీ అనుకునేవాళ్ళందరూ... కళ స్వరూపతత్త్వాలు ఎరుగనివాళ్ళే. కాఫ్కాలో మరీ అంత అతిశయం లేదు. అతను సాహిత్యానికి పరమార్థం దాని వెలుపల వెతుక్కోలేదు. సాహిత్యానికి అతను ఆపాదించుకున్న ఆశయాలు — ఆత్మాతిశయ కళాకారుల దృక్కోణం నుంచి చూస్తే — చాలా బడుగువి. ఒక ఉత్తరంలో ఇలా రాశాడు: "నేను చేరవేయలేనిదాన్ని చేరవేయాలని ప్రయత్నిస్తాను, వివరించలేనిదాన్ని

వివరించాలనుకుంటాను, నా ఎముకల్లో ఉన్నదీ నా ఎముకల్లో మాత్రమే అనుభూతి చెందగలిగేదీ ఏమిటో అది తెలియజెప్పాలనుకుంటాను.''

అతను కలాన్ని పట్టుకుని తనకు తెలియని వలయాల్లోకి వెళ్ళలేదు. తన లోపలి వలయాల్లోనే తిరిగాడు. కానీ అతని కలం తాకిడికి ఆ లోపలి వలయాల్లో పుట్టిన ప్రకంపనాలతో పాటు, ఆధునిక మానవుని మౌలిక స్వభావమేదో అనునాదం చెందింది. దాంతో అతని సాహిత్యం ఇరవయ్యో శతాబ్దపు సందిగ్ధ మానవుని మనఃచైతన్యానికి ప్రతినిధిగా నిలిచింది. ''డాంటే, షేక్స్పియర్, గెథెలకూ, వారి వారి కాలాలకూ ఎలాంటి సంబంధం ఉందో, కాఫ్కాకూ మన కాలానికీ అలాంటి సంబంధమే ఉంది'' అంటాడు కవి డబ్ల్యూహెచ్ ఆడెన్. కాఫ్కా రచనలు దీన్నెలా సాధించాయో తెలుసుకోవాలంటే అతని జీవితాన్ని క్లుప్తంగానైనా పరిశీలించాలి.

# 1

# అరెస్టు - శ్రీమతి గ్రుబాక్‌తోను, కుమారి బర్స్టనర్‌తోనూ సంభాషణ

ఎవరో జోసెఫ్.కె మీద అపవాదు మోపారు, ఎందుకంటే ఏ తప్పూ చేయకపోయినా, ఒక ఉదయాన అతను అరెస్టయ్యాడు. రోజూ ఎనిమిదింటికల్లా అతని ఇంటి యజమానురాలైన శ్రీమతి గ్రుబాక్ తాలూకు వంటమనిషి అతనికి అల్పాహారం పట్టుకొచ్చేది. ఆ వేళ మాత్రం రాలేదు. ఇలా ఎన్నడూ జరగలేదు. ఎదురింటి ముసలావిడ, ఆవిడక్కూడా అసాధారణమైన కుతూహలంతో, ఎందుకో అతడి వైపు తొంగి చూస్తోంది. కె ఆవిణ్ణి చూస్తూ కాసేపు అలా తలగడ మీదే ఉండిపోయాడు. చివరికి కాస్త అసహనంతోనూ, మరికాస్త ఆకలి వల్లనూ, బెల్లు మోగించాడు. తలుపు మీదెవరో తట్టిన శబ్దమైంది. వెంటనే ఒక వ్యక్తి లోనికి ప్రవేశించాడు. అతణ్ణి ఈ ఇంట్లో ఇదివరకెన్నడూ చూడలేదు. అతను సన్నగా, కాని బలంగా ఉన్నాడు, బిగుతైన నలుపు కోటు తొడుక్కున్నాడు, యాత్రికుని వేషంలా అది జేబులూ, బొత్తాలూ, బకిల్సూ, బెల్టుతో కిక్కిరిసి ఉంది, వాటివల్ల ఏదో హుందాయైన హోదా వ్యక్తమవుతోంది, కాని అదేమిటన్నది ఖచ్చితంగా చెప్పటం కష్టం. "ఎవర్నువ్వు?" అని అడుగుతూ మంచం మీంచి సగం లేచి కూర్చున్నాడు కె. కానీ ఆ వ్యక్తి తన సమక్షాన్ని అంగీకరించక తప్పదన్నట్టు ఆ ప్రశ్నను నిర్లక్ష్యం చేసి, "బెల్ కొట్టావా?" అని మాత్రం అడిగి ఊరుకున్నాడు. "నాకు అన్నా అల్పాహారం తేవాలి," అన్నాడు కె, ఆ వ్యక్తి ఎవరై ఉండచ్చా అన్నది

పోల్చుకోవటానికి నిశ్శబ్దంగా అతణ్ణి పరిశీలించసాగాడు. ఈ పరిశీలనకు ఆ వ్యక్తి ఎక్కువసేపు లొంగలేదు, తలుపు వైపు తిరిగి దాన్ని కాస్త ఓరగా తెరిచి, బహుశా దాని వెనకే ఉన్న ఎవరితోనో, "తనకు అన్నా అల్పాహారం తేవాలట" అని చెప్పాడు. జవాబుగా అవతలి గది నుంచి ఫక్కుమని నవ్విన ధ్వని వినిపించింది; అది పలువ్యక్తుల నుంచి వెలువడిందా ఒకరి నుంచేనా అన్నది అర్థం కాలేదు. ఆ ఆగంతకునికి ఆ ధ్వని ద్వారా కొత్త సంగతేమీ తెలిసే వీల్లేకపోయినా, ఏదో సందేశం చేరవేస్తున్నట్టు, "అది సాధ్యం కాదు," అన్నాడు కె తో. "ఇదేదో మాబాగా ఉందే," అని అరుస్తూ మంచం మీంచి దిగ్గున లేచాడు కె. లేచి పంట్లాం తొడుక్కుంటూ, "ముందసలు బయట ఎవరున్నారో, ఈ విపరీత ప్రవర్తనకు శ్రీమతి గ్రుబాక్ ఏం సంజాయిషీ ఇస్తుందో చూడాలి," అన్నాడు. కాని వెంటనే అనిపించింది తానీ మాటలు పైకి అని ఉండాల్సింది కాదని, దాని వల్ల ఒక విధంగా ఈ ఆగంతకునికి తన విషయాల్ని పర్యవేక్షించే హక్కుందని తానే ఒప్పుకున్నట్టయింది, కానీ ఆ క్షణంలో అదేమంత ముఖ్య విషయం కాదనిపించింది. ఆగంతకుడు మాత్రం అతని మాటల్ని అలాగే అర్థం చేసుకున్నట్టున్నాడు. అందుకే, "నువ్వు ఇక్కడ ఆగటమే మంచిదేమో కదూ?" అని అడిగాడు. "ముందు నిన్ను నువ్వు పరిచయం చేసుకోకపోతే నేనిక్కడ ఆగటమూ జరగదు, నీ మాటలు వినటమూ జరగదు," అన్నాడు కె. "నే చెప్పింది నీ మంచికే," అంటూనే తలుపు తెరిచి పట్టుకున్నాడు ఆగంతకుడు. కె మెల్లగా పక్క గదిలోకి ప్రవేశించాడు. చూట్టానికి అక్కడ అంతా నిన్న సాయంత్రం ఎలా సర్ది ఉందో అలాగే కనిపించింది. అది శ్రీమతి గ్రుబాక్ మసలుకునే గది. అక్కడ

కిక్కిరిసి ఉన్న ఫర్నిచర్, రగ్గులు, చైనా సామాను, ఫోటోలు వీటన్నింటి మధ్యా ఎప్పటికన్నా ఖాళీ స్థలం ఎక్కువ ఉన్నట్టనిపించింది; కాని అది చూడగానే తెలియటం లేదు. ఎందుకంటే గదిలో ముఖ్యమైన మార్పు ఒక వ్యక్తి సమక్షం వల్ల వచ్చింది. అతను తెరిచి ఉన్న కిటికీ దగ్గర కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు. దాన్నించి తలెత్తి చూసి, “నువ్వు నీ గదిలోనే ఉండాల్సింది! ఫ్రాంజ్ నీకా విషయం చెప్పలేదా?” అన్నాడు. “అవును చెప్పాడు. కానీ అసలు మీరేం చేస్తున్నారిక్కడ?” ఈ కొత్త పరిచయస్తుణ్ణీ, ఇంకా తలుపు దగ్గరే నిలబడి ఉన్న ఫ్రాంజ్ అనబడే వ్యక్తినీ మార్చి మార్చి చూస్తూ అడిగాడు కె. తెరిచి ఉన్న కిటికీ గూండా ఎదురింటి ముసలావిడ మళ్ళీ కనిపించిందతనికి. చూడగలిగిందంతా చూసితీరాలనే ముసలి ఆత్రంతో ఇపుడామె ఈ కిటికీకి తిన్నగా ఉన్న కిటికీ దగ్గరికి తరలి వచ్చింది. “నేను ముందు శ్రీమతి గ్రుబాక్ ని కలవాలి,” అన్నాడు కె. వారిద్దర్నీ విడిపించుకుని బైటికి వెళ్ళాలన్నట్టు ధ్వనించిందా మాట (నిజానికి వాళ్ళిద్దరూ అతనికి చాలా దూరం నిలుచున్నారు). “వీల్లేదు,” అంటూ చేతిలో పుస్తకాన్ని టేబిల్ మీద పడేస్తూ లేచాడు కిటికీ దగ్గర వ్యక్తి. “వెళ్లటానికి వీల్లేదు. నువ్వు అరెస్టయ్యావు,” అన్నాడు. “చూట్టానికి అలాగే ఉంది. కాని ఎందుకు?” అడిగాడు కె. “నీకు ఆ విషయం చెప్పే అధికారం మాకు లేదు. నీ గదికి వెళ్ళి అక్కడే వేచి ఉండు. నీకు వ్యతిరేకంగా ప్రొసీడింగ్సు మొదలయ్యాయి. సమయమొచ్చినపుడు అంతా తెలుస్తుంది. నీతో ఇలా స్వేచ్ఛగా మాట్లాడటం ద్వారా నేను నా కందిన ఉత్తర్వుల్ని మీరుతున్నట్టే. అది కూడా నా మాటల్ని ఇక్కడ ఫ్రాంజ్ తప్ప మరెవ్వరూ వినటం లేదన్న ధైర్యంతో. నిజానికి అతను కూడా నీతో చాలా స్వేచ్ఛగా వ్యవహరించాడు. నీకు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1670**

* * *